# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 83 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శుక్రవారం 21 నవంబర్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## దేవుళ్ల పేరుతో సినిమాలు తీస్తావ్
# నమ్మకం లేదంటావా రాజమౌళి

### మండిపడ్డ ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే ఉదయం) రాజమౌళి ప్రతి సినిమాను హిందూ సమాజం బహిష్కరించాలని ఎమ్మెల్యే రాజాసింగ్ పిలుపునిచ్చారు. ఇటీవల ఓ ఈవెంట్‌లో భాగంగా రాజమౌళి చేసిన వ్యాఖ్యలపై తాజాగా రాజాసింగ్ స్పందించారు. ప్రస్తుతం డైరెక్టర్ రాజమౌళికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోందన్నారు.. తన అమ్మానాన్నలకు హనుమంతుడిపై విశ్వాసం ఉంది కానీ.. తనకు లేదని రాజమౌళి అన్న మాటలను రాజాసింగ్ గుర్తు చేశారు. నీకు విశ్వాసం లేదు కానీ.. అదే ధర్మం, దేవుళ్లపై సినిమాలు చేసి.. రూ. కోట్లల్లో సంపాధించుకున్నావు కదా..? అని ప్రశ్నించారు.

# ఈ-కార్ రేసింగ్.. కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి



**హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే ఉదయం)**

ఈ- కార్ రేసింగ్ కేసులో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతిలిచ్చారు. ఆయనను ఏసీబీ విచారించేందుకు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటికే ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో 4 సార్లు ఏసీబీ విచారణకు కేటీఆర్ హాజరయ్యారు. రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం కేసులో ఏసీబీ ఈ విచారణ జరుపుతోంది. ఈ కేసులో కేటీఆర్ పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలంటూ గవర్నర్‌ను ఏసీబీ అనుమతి కోరింది. ఈ మేరకు గతంలోనే ఏసీబీ లేఖ రాసింది. దానిని పరిశీలించిన గవర్నర్ తాజాగా కేటీఆర్ విచారణకు అనుమతి జారీ చేశారు. ఈ-కార్ రేసింగ్ కేసులో ఏసీబీ త్వరలోనే ఛార్జిషీట్ దాఖలు చేయనుంది.

వైదొలగడం వెనుక కారణాలపై ఆరా : ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌పై 2022 అక్టోబరు 25న ఒప్పందం కుదిరింది. ఫార్ములా-ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్స్ట్ జెన్, పురపాలక శాఖలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. 9, 10, 11, 12వ సీజన్ల కార్ రేస్‌లు హైదరాబాద్‌లో నిర్వహించేలా ఒప్పందం కుదిరింది. 2023 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో నెక్లెస్‌రోడ్‌లో తొమ్మిదో సీజన్ రేసింగ్ నిర్వహించారు. తదుపరి ఏడాది 10 వ సీజన్ నుంచి ఏస్ నెక్స్ట్‌జెన్ అకస్మాత్తుగా తప్పుకుంది. దాంతో ప్రమోటర్‌గా హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ)నే పోషించాలని అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు.

ఈ నిర్ణయంతోనే వివాదం : ఈ నేపథ్యంలో 2023 అక్టోబరు 54.88 కోట్లను ఫార్ములా-ఈ ఆపరేషన్స్ సంస్థకు హెచ్‌ఎండీఏ నేరుగా బదిలీ చేసింది. ఈ వ్యవహారమే ఇప్పుడు ఈ మొత్తం వివాదానికి తెరలేపింది. హెచ్‌ఎండీఏ బోర్డు, ఆర్థికశాఖ, ఆర్బీఐ అనుమతి లేకుండానే ఈ చెల్లింపులు జరిగాయి. వీటిలోనూ రూ.46 కోట్ల వరకు డాలర్ల రూపంలో చెల్లించారనేది ప్రధాన అభియోగం. ఈ మేరకు ఏసీబీ విచారణ జరిపింది.

ఏ1గా కేటీఆర్ : ఈ చెల్లింపులపై ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏసీబీ గత ఏడాది

..మిగతా 2లో

# దుబాయ్, సింగపూర్‌లతో పోటీ

## ఫ్యూచర్ సిటీలో నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రం

### తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌లో రేవంత్




**హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే ఉదయం)**

:పెట్టుబడులకు హైదరాబాద్ వేదికగా మారిందని, తాము పక్క రాష్ట్రాలతో కాకుండా దుబాయ్, సింగపూర్ లాంటి దేశాలతో పోటీ పడతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ వేదికగా 6 రోజుల పాటు రెండు విడతలుగా జరిగే తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావ్, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ వివిధ రంగాల్లో దూసుకుని పోయేలా కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని అన్నారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు. తెలంగాణతో పాటు పాటు 8 ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 600 మంది పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో మొదటి దశ ఫెస్టివల్‌లో సినిమాలు, సాహిత్యం వంటి అంశాలపై సెమినార్లు, చర్చా గోష్ఠిలు, ప్రదర్శనలు ఉంటాయని, 25 నుంచి 27 వరకు సాగే 2వ విడతలో ఆరోగ్యం, సాంకేతికత వంటి అంశాలపై చర్చలు ఉంటాయని చెప్పారు. రోజూ 2వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, 40 మంది పౌర పురస్కార విజేతలు కూడా దీనికి హాజరవుతారని గవర్నర్ కార్యాలయ కార్యదర్శి దాన కిశోర్ తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వారసత్వం ఇచ్చి పుచ్చుకోవడానికే కాదు ఒకరి ఉత్పత్తులు



## కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లకు
# స్పీకర్ మరోసారి నోటీసులు

### తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొన్న స్పీకర్

### 8 మంది ఎమ్మెల్యేల పిటిషన్లపై పూర్తి కానున్న విచారణ

### ఈ నేపథ్యంలో ఇద్దరికి మరోసారి నోటీసులు జారీ చేసిన స్పీకర్

**హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే ఉదయం)**

ఫిరాయింపు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లకు సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మరోసారి నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై వివరణ కోరుతూ ఆయన ఈ నోటీసులు జారీ చేశారు. తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గతంలో నోటీసులు జారీ చేయగా, సమాధానం ఇచ్చిన 8 మందిపై విచారణ కొనసాగుతోంది. దానం నాగేందర్, కడియం శ్రీహరి మాత్రం సమాధానం ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని కోరారు. ఈ రోజుతో 8 మంది ఎమ్మెల్యేలకు చెందిన పిటిషన్లపై విచారణ పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో సభాపతి వారిద్దరికి మరోసారి నోటీసులు జారీ చేశారు. తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని అందులో పేర్కొన్నారు. విచారణ పూర్తయిన ఎమ్మెల్యేలకు సంబంధించి న్యాయ సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాత సభాపతి నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

## మూడు విడతల్లో
# పంచాయతీ ఎన్నికలు!

### ప్రభుత్వానికి డెడికేటెడ్ కమిషన్ నివేదిక




### 50 శాతం మించకుండా తాజాగా రిజర్వేషన్లు సిఫారసు చేసిన డెడికేటెడ్ కమిషన్

### పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల శాతం సిఫారసు చేసిన కమిషన్

### డిసెంబరులో పంచాయతీ ఎన్నికలు!

2లో..



## తిరుమల చేరుకున్న
# రాష్ట్రపతి ముర్ము

**తిరుమల,నవంబర్ నవంబర్ 20 (నమస్తే ఉదయం)**

రెండ్రోజుల పర్యటన నిమిత్తం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల చేరుకున్నారు. శ్రీపద్మావతి విశ్రాంతి గృహం వద్ద ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జానకీదేవి, భానుప్రకాశ్‌రెడ్డి, తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి.. రాష్ట్రపతికి స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని రాష్ట్రపతి దర్శించుకోనున్నారు. అంతకు ముందు రేణిగుంట విమానాశ్రయం నుంచి ద్రౌపది ముర్ము తిరుచానూరు వెళ్లి శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

# సీఎం రేవంత్‌తో అనలాగ్ సిఇవో భేటీ

### పలు అభివృద్ధి పథకాలపై చర్చ

**హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే ఉదయం)**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అనలాగ్ ఎఐ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అలెక్స్ కిప్‌మాన్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణను భవిష్యత్ నగరాల దిశగా తీసుకెళ్లడానికి చేపడుతున్న ఏఐ సిటీ ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాల్లో తర్వాతి తరం 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' సిస్టమ్‌లను ఎలా అనుసంధానించొచ్చన్నది ఈ సమావేశంలో చర్చించారు. సీఎం రేవంత్ రెడ్డి అభ్యర్థన మేరకు తమ ఆధునిక సాంకేతిక ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించి హైదరాబాద్ నగరం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ట్రాఫిక్ రద్దీ, పట్టణ వరదలు, వాతావరణ మార్పుల అంచనా వంటి అంశాలను పరిష్కరించడంలో సహకరించేందుకు అంగీకారాన్ని తెలిపింది. ఈ పరిష్కారాలు నగర పాలనను స్మార్టుగా మార్చడంలో కీలక పాత్ర పోషించనున్నాయని అధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా రాబోయే డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు హాజరయ్యేలా కిప్‌మాన్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

# నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి, నవంబర్ (20 నమస్తే ఉదయం) మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం హైదరాబాద్ బి.ఆర్.కే. భవన్‌లో తెలంగాణ రాష్ట్ర పోలీసు ఫిర్యాదుల అథారిటీ చైర్మన్ జస్టిస్ డాక్టర్ బి. శివశంకర్ రావు , అలాగే జిల్లా పోలీసు ఫిర్యాదుల అథారిటీ చైర్మన్ రిటైర్డ్ జడ్జ్ సుదర్శన్ మర్యాదపూర్వకంగా కలిసి కీలక అంశాలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అల్వాల్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో 2025 జూలై 15న జరిగిన బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో చోటుచేసుకున్న ప్రోటోకాల్ ఉల్లంఘన అంశాన్ని ప్రస్తావించారు. కౌకూర్ ఫార్చ్యూన్ ఎంక్లేవ్ కాలనీ వాసులపై నమోదు చేసిన కేసుల పునఃపరిశీలన కావాలని అభ్యర్థించారు. మల్కాజ్‌గిరి పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న శాంతి భద్రతా చర్యల పురోగతిపై చర్చిస్తూ, ప్రజల హక్కులు, ప్రాధాన్యతలను కాపాడాలని కోరారు. ఎమ్మెల్యే చైర్మన్ గారికి వినతి చేస్తూబిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు , సాధారణ ప్రజలపై అనవసర కేసులు నమోదు చేయకుండా, ప్రతి కేసును నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రోటోకాల్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. శాంతి భద్రతలు మెరుగుపడేలా పోలీస్ వ్యవస్థ మరింత బాధ్యతతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. జస్టిస్ డాక్టర్ బి. శివశంకర్ రావు స్పందిస్తూ, అందజేసిన వివరాలు, వినతిపై తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్ లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారిని సత్కరించిన ఎండీ

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే ఉదయం) జలమండలికి జాతీయ అవార్డును అందుకున్న సందర్భంగా జలమండలి ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి సత్యనారాయణను ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ లు ఎండీ ఛాంబర్ లో సత్కరించారు. ఈ సందర్బంగా ఎండీ మాట్లాడుతూ.. ఓ ఆర్ ఆర్ పరిధిలో ఇంకుడు గుంతలు నిర్మాణంలో క్రియాశీల పాత్ర పోషించారని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్లు సుదర్శన్, టీవీ శ్రీధర్, వినోద్ భార్గవ, సీవీవో గ్యానేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిఎండి ముషారఫ్ కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

## నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్

#### ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ అని కలిసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 20(నమస్తే ఉదయం) మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి , తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారుఖీని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. .మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని వెంకటాపురం డివిజన్ యాదమ్మనగర్ పరిధిలో పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలు ు ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాల వారు నివసిస్తున్న ప్రాంతంలో విద్యుత్ సదుపాయాలను మెరుగుపరచాలని కోరుతూ పలు అభ్యర్థనలు చేశారు. ఎమ్మెల్యే ముఖ్యంగా క్రిందిఅంశాలను ప్రతిపాదించారు యాదమ్మనగర్ ప్రాంతంలో విద్యుత్ బల్క్ మీటర్ల ఏర్పాటు,కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు,నూతన ట్రాన్స్ఫార్మర్ల స్థాపన,సింగిల్ ఫేజ్ నుంచి త్రీ ఫేజ్ కన్వర్షన్,బంచ్ కేబుల్స్ ఏర్పాటు,అవసరమైన చోట విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలపై ఎమ్మెల్యే వినతిపత్రం అందజేయగా, టిజీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారుఖీ సానుకూలంగా స్పందిస్తూ త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు . ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## దుబాయ్, సింగపూర్‌లతో పోటీ

**మొదటి పేజీ తరువాయి...**

మరొకరు అమ్మడానికి, కొనడానికి దోహదం చేస్తుందని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి అన్నారు. సంస్కృతి, సహజ వనరుల పరంగా ఈశాన్య రాష్ట్రాలు ఎంతో గొప్పవని.. మన దేశం అతిథి దేవో భవ అంటే వారు అభివృద్ధి దేవో భవ అంటున్నారని తెలిపారు. సంక్షేమ ఫలాలు అందరికీ చేరడమే అసల్కైన అభివృద్ధి అన్నారు. తొలి రోజు ఉత్తమ ప్రదర్శన కనబరిచిన కళాకారులకు గవర్నర్ బహుమతులు అందజేశారు. మిజోరాం యువజన సర్వీసులు, క్రీడల మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి సన్మానించారు.

## బాలకృష్ణకు మరో అరుదైన గౌరవం

### గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఘనంగా సన్మానం



హైదరాబాద్,నవంబర్ 20(నమస్తే ఉదయం) నటుడు నందమూరి బాలకృష్ణకు మరో అరుదైన గౌరవం దక్కింది. గోవా వేదికగా గురువారం వైభవంగా ప్రారంభమైన 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా'వేడుకలో బాలయ్యను సన్మానించారు. నటుడిగా 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బాలకృష్ణకు ఈ గౌరవం దక్కింది. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్, గోవా సీఎం ప్రమోద్ సావంత్ బాలకృష్ణను శాలువాతో సత్కరించారు. 50 ఏళ్ల నట ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న రజనీకాంత్‌ను కూడా ముగింపు వేడుకలో సన్మానించనున్నారు. ఈ నెల 28 వరకూ ఈ వేడుక కొనసాగనుంది.

## ఈ-కార్ రేసింగ్.. కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి

**మొదటి పేజీ తరువాయి...**




డిసెంబర్‌లో విచారణ ప్రారంభించింది. రేసింగ్‌లో అవకతవకలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇందులో ఏ1గా అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి పేర్లను చేర్చింది. ఇందులో కేటీఆర్‌ను ఏసీబీ ఇప్పటివరకు 2 సార్లు నోటీసులు జారీచేసి విచారించింది.

ఈ కేసులో మొదట్లో కీలకంగా ఉన్న ఏస్‌నెక్స్ట్‌జెన్ సంస్థ ప్రతినిధులను ఏసీబీ జనవరిలో విచారించింది. ఏస్ నెక్స్ట్‌జెన్ సంస్థ డైరెక్టర్ అనిల్‌ను దర్యాప్తు అధికారులు సుమారు రెండున్నర గంటల పాటు ప్రశ్నించారు. ఈ కేసులో ఏస్ నెక్స్ట్రెన్ సంస్థనే రేసు నిర్వహించాల్సి ఉండగా కార్ రేస్‌కు సంబంధించి అనుమతులు పొందేందుకు సమర్పించిన పత్రాలు, బ్యాంకు ఖాతాలకు సంబంధించి వివరాలు గురించి ఏసీబీ అధికారులు ప్రశ్నించారు.

చిల్లర రాజకీయాలన్న హరీశ్ రావు : మరోవైపు ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు స్పందించారు. కేటీఆర్‌పై రాజకీయకక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ట అని ఆయన ఆరోపించారు. ఈ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తోందని, ప్రతిపక్ష నేతలను వేధించడమే రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. స్థానికఎన్నికల్లో రాజకీయలబ్ధి కోసం చిల్లర డ్రామాలు చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు.



## అమావాస్య అన్న ప్రసాద వితరణ

రాజేంద్రనగర్, నవంబర్ 20( నమస్తే ఉదయం) అత్తాపూర్ ఆర్యవైశ్య సంఘం ద్వారా గురువారం అన్నప్రసాద వితరణ చేస్తాం. ఈ కార్యక్రమానికి వచ్చి సహరించిన అధ్యక్షులు అరవింద్ గుప్త ప్రదకార్య దర్శి బచ్చు అశోక్ గుప్త కార్యక్రమ చైర్మన్ ఆకుతోట విజయకుమార్ , మాజీ అధ్యక్షులు చంద్రశేఖర్ కార్యవర్గ సభ్యులు వజ్ర లింగం,ఓరుగంటి వెంకటేశ, మణిదీప్ మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## దేవుడిని అడ్డంగా పెట్టుకుని సినిమాలు

### కనీస సామాజిక బాధ్యత లేని రాజమౌళి

### వారణాసి టైటిల్ వ్యాఖ్యలపై మండిపడ్డ మాధవీలత

హైదరాబాద్,నవంబర్ 20(నమస్తే ఉదయం) దర్శకుడు రాజమౌళి దేవుణ్ణి అడ్డంగా పెట్టుకొని డబ్బులు సంపాదిస్తున్నారని బీజేపీ నాయకురాలు మాధవి లత పేర్కొన్నారు. తాజాగా వారణాసి టైటిల్ రిలీజ్ సందర్భంగా రాజమౌళి చేసిన కామెంట్లపై మాట్లాడుతూ... నమ్మకాన్ని వ్యాపారంగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. హిందువులు తేరగా దొరుకుతున్నారా? రాముడికి ఒకే పెళ్లాం ఉంది అంటున్న రాజమౌళికి ఎంతమంది పెళ్లాలు ఉన్నారని ప్రశ్నించారు. కర్మ ఫలితం అనుభవించాడు కాబట్టే ఆంజనేయుడు లేడని అన్నాడు.. సినిమా చూసే మా వాళ్లకు బుద్ధి ఉండాలని హిందువులను ఉద్దేశించి అన్నారు. వందల కోట్లు సంపాదించిన నీవు.. బాహుబలి సినిమాకి పనిచేసిన వారికి ఏమైనా ఇచ్చావా? అని నిలదీశారు. రాజమౌళి భక్తిని తీసుకురాలేదు? దాన్ని వాడుకుంటున్నారన్నారు. భక్తే లేదు అనే వాడి దగ్గరికి మనం వెళ్తామా? నీవు ఏమి దైవ సేవ చేశావ్.. అయిన దేవుడు అన్ని కోట్లు ఇచ్చాడు కదా..? అని నిలదీశారు. నీకు ఎందుకు అంతా బాధ.. మనమే మన హిందూ ధర్మాన్ని కించ పరుస్తున్నామన్నారు మాధవి లత.. 'మా కష్టం మీద విష బిందువు వేస్తున్నారు.. దయచేసి మీరు ఇలాంటి కామెంట్స్ చేయకు.. వ్యక్తి గతం అయితే ఇంట్లో మాట్లాడుకోవాలి.. ఆయన మాట్లాడింది వ్యక్తిగతం కాదు.. సినిమా వాళ్లు ఈ అంశంపై స్పందించక పోవడం వాళ్ల సొంతం.. అక్కినేని నాగేశ్వరరావు ఎప్పుడు దైవ దూషణ చేయలేదు.. మన మతం మీద మనమే సినిమాలు తీస్తూ దూసిస్తే ఎలా? సినిమా చూసే వాళ్లు కూడా భక్తి లేదని అనుకుంటే ఆయన వ్యాపారం తుస్సు మంటుంది.. ఆయనకు సామాజిక బాధ్యత లేదు.. టికెట్ కొనుక్కుని సినిమా చూసే వాళ్ళను అవమానించారు.. మనసు గాయ పరిచారు.. అందరూ నాస్తికులు అయితే నీ సినిమా చూసేది ఎవరు? నా దేవుళ్ళను ఒవైసీ బ్రదర్స్ అవమానించారని నేను రాజకీయాల్లోకి వచ్చాను.. నా దేవుళ్ళ పైకి ఎవరు వచ్చిన ఊరుకోను.. నాకు పదవి వచ్చిన రాకున్నా ఇలానే ఉంటా.. రాజమౌళి మాటల ప్రభావం పడుతుంది.. ఆంజనేయ స్వామిని అన్నావు కాబట్టే ఇప్పుడు నీకు చుట్టుకుంటుంది.. షూటింగ్ లలో దేవుణ్ణి ఇంకా ఏమన్నావో..? రాజమౌళి తో సమాధానం భగవంతుడు ఇప్పిస్తారు.. దేవుడు ఉన్నాడు అని ఆయనతోనే చెప్పిస్తారు.. బస్తీ మే సవాల్ చూడండి.. ఆయన మీద జాలి కూడా పోయింది.. రాముడి మీద అసహ్యంగా మాట్లాడారు.. ఆయనకు క్షమాపణకు కూడా అర్హత లేదు.. తగిన గుణపాఠం చెప్పాలి..' అని రాజమౌళిపై ఫైర్ అయ్యారు.

# మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు!


**హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే ఉదయం)**




తెలంగాణలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. డెడికేషన్ కమిషన్ బూసాని వెంకటేశ్వర రావు సీఎస్ రామకృష్ణరావుకు నివేదిక సమర్పించారు. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా కమిషన్ తాజాగా రిజర్వేషన్లను సిఫార్సు చేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం కోర్టులో ఉన్నందున పాత రిజర్వేషన్ల పద్ధతిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరపాలని ఈనెల 17న నిర్ణయించిన కేబినెట్ దానికి అనుగుణంగా సిఫార్సు చేయాలని డెడికేటెడ్ కమిషన్‌ను కోరింది. డిసెంబరు 16 వరకు పంచాయతీల ఎన్నికలు పూర్తి! : మూడు రోజులుగా కసరత్తు చేసిన డెడికేడెట్ కమిషన్ నివేదికను సమర్పించింది. డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించిన తర్వాత దాని ఆధారంగా పంచాయతీ రాజ్ శాఖ కొత్త రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈ నెల 24న హైకోర్టులో విచారణ సమయానికి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం కొత్త రిజర్వేషన్ల జాబితా ఇస్తే ఈనెల 24 లేదా 25న షెడ్యూలు ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రణాళికలు సిద్ధం చేసింది. మూడు విడతల్లో డిసెంబరు 16 వరకు పంచాయతీల ఎన్నికలు పూర్తి చేయాలని ఎస్ఈసీ భావిస్తోంది. పంచాయతీ ఎన్నికలపై ఉన్నతాధికారులతో ఎస్ఈసీ సమావేశం : ఇవాళ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, కలెక్టర్లతో ఎస్ఈసీ రాణికుముదినీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని అధికార యంత్రాంగానికి రాణికుముదినీ తెలిపారు. గ్రామాల్లో ఓటరు జాబితాలో పొరపాట్ల సవరణ ప్రక్రియ ఈనెల 23 వరకు పూర్తి కానుంది. రాష్ట్రవ్యాప్తంగా 12,733 పంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్ విడుదల : మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పంచాయతీల్లో ఓటరు జాబితా మరోసారి సవరణకు ఎస్ఈసీ షెడ్యూలు విడుదల చేసింది. నేటి నుంచి నవంబర్ 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని తెలిపింది. ఈ నెల 20న ఓటర్ల దరఖాస్తులు, తప్పుల సవరణ, అభ్యంతరాల స్వీకరణ, ఈ నెల 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికలను పూర్తి చేస్తేనే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు : సోమవారం మంత్రి మండలి భేటీలో స్థానిక ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరిగింది. రిజర్వేషన్ల అమలు, రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు, న్యాయ నిపుణుల సలహాలపై పంచాయతీరాజ్‌శాఖ నివేదిక ఇచ్చింది. దానిపై మంత్రులు తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ నెల 24న తెలంగాణ హైకోర్టులో విచారణ గురించి చెప్పారు. మార్చి 31లోపు పంచాయతీ ఎన్నికలను పూర్తి చేస్తేనే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని అన్నా రు.

# ఆలయాలకు పోటెత్తిన భక్తులు





కేటిదొడ్డి, నవంబర్20 (నమస్తే ఉదయం)అమావాస్య సందర్భంగా కేటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంటా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్నికి గురువారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అఖండ భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**కన్నుల పండువగా స్వామీ వారి కళ్యాణోత్సవం**

అమవాస్య సందర్భంగా పాగుంటా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహొత్సవం కన్నుల పండువగా కొనసాగింది. తెల్లవారుజామున ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, అభి షేకం, దీక్షా హెూమం, శాంతిహెూమం, పూర్ణాహుతి, చక్ర స్నానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంత రం అలివేల మంగ సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రథోత్సవ కార్యక్రమాని నిర్వహించారు.



## జాంపల్లి ఎంపీపీఎస్‌ను సందర్శించిన ఎంఈఓ

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 20(నమస్తే ఉదయం) ధరూర్ మండలం జాంపల్లి ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎమ్ఈఓ రవీంద్రబాబు గురువారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదుల నిర్వహణ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు చేయాలని కోరారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించేందుకు వారితో చతుర్విధ ప్రక్రియలు చేయించారు.విద్యార్థుల అభ్యసనసామర్థ్యము పరిశీలించి, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. హెచ్ఎం రేవతి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల కరువు భత్యం విడుదల చేయాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, నవం20(నమస్తే ఉదయం)రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు బకాయి ఉన్న అయిదు విడతల కరువు భత్యాన్ని ప్రభుత్వం వెంటనే అందించాలని పీఆర్టీయు తెలంగాణ సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి యోగెందర్‌లు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన మేరకు డిసెంబర్ 9నుంచి నిర్వహిస్తున్న ప్రజాపాలన దినోత్సవంలో పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకొని పీఆర్సీ ని ప్రకటించాలని, ఉపాధ్యాయుల పాలిట గుదిబండగా మారిన టెట్ నుండి 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు మినాహాయించాలని కోరారు. అలా కాని పక్షంలో మినిమం క్వాలిఫైయింగ్ మార్కులను తగ్గించాలని 35 మార్కులను క్వాలిఫైయింగ్ మార్కులుగా గుర్తించాలని వారు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



## "అవగాహన - అప్రమత్తతే ఇంటి భద్రతకు - సమాజ రక్షణకు నాంది!"

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 20(నమస్తే ఉదయం) జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఆదేశాల మేరకు, పోలీస్ కళాబృందం కె.టి.దొడ్డి మండలం ఉమిత్యాలతండాలో రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్ప్రభావాలు, పోక్సో చట్టం, సీసీ కెమెరాల ప్రాధాన్యం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించింది.కళాబృందం సభ్యులు డయల్-100 సేవల వినియోగం, బ్లూ కోల్ట్స్ స్పందన, హెల్మెట్ వినియోగం, మైనర్ రైడింగ్ ప్రమాదాలు, సైబర్ మోసాలకు గురైతే 1930 కాల్ చేయాల్సిన అవసరం వంటి విషయాలు వివరించారు. బ్యాంకులు ఎప్పుడూ ఓటీపీ అడగవని ప్రజలకు స్పష్టం చేశారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత జాగ్రత్తగా ఉండాలని, ఎక్కడైనా డ్రగ్స్ సరఫరా గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కె.టి. దొడ్డి ఎస్సై శ్రీనివాసులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వింగ్ ఎస్ఐ కేశవరావు,కళాబృందం సభ్యులు రాధమ్మ, రామాంజనేయులు, షీ టీమ్ కానిస్టేబుల్ లోకేశ్వరి, గ్రామ ప్రజలు, కె టి దొడ్డి ఎస్సై శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్‌లో గద్వాల విద్యార్థుల ప్రతిభ

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్20(నమస్తే ఉదయం)తెలంగాణ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ 2025లో గద్వాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్ లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 17, 18, 19న నిర్వహించిన తెలంగాణ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ 2025 పోటీల్లో వుషు యుద్ధ కళల పోటీలలో గద్వాల జిల్లా కేంద్రంలోని మదర్స్ ల్యాప్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలోని కేటగిరి 2 లో సిద్రతుల్ ముంతహ 2 సిల్వర్, అబ్రాజ్ 1 గోల్డ్, 1 సిల్వర్, ఉమర్ 2 గోల్డ్ బహుమతులు కైవసం చేసుకున్నారు. అదేవిధంగా సబ్ జూనియర్ అండర్ 12లోని సండ (ఫైట్) విభాగంలో యాహ్యా అలీ ఖాన్ 1, సబ్ జూనియర్ అండర్ 14 లో మహమ్మద్ సాద్ (బ్రాంజ్), హసనుద్దీన్, ఎండి ఉమర్ (సిల్వర్), ఎండి సాద్ (గోల్డ్) పథకాలు సాధించారు. విద్యార్థుల ప్రతిభ పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## నేటి నుంచి ఆరాంఘర్ నుంచి గచ్చిబౌలి వరకు ఆర్టీసీ బస్సులు

బుద్వేల్, నవంబరు 20 (నమస్తే ఉదయం) : ఈ నెల 21 నుంచి ఆరాంఘర్ చౌరస్తా నుంచి గచ్చిబౌళి వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నారు. హైదరాబాద్ రీజియన్ నేరుగా ఈ బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నారు. శివరాంపల్లి, శ్రీరాంకాలనీ, మధుబన్ కాలనీ, కాటేదాన్, బవానీ కాలనీ, బుద్వేల్ తదితర ప్రాంతాలకు చెందిన ఆర్టీసీ ప్రయాణికులకు ఈ బస్సు సర్వీసుల వల్ల ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆరాంఘర్ లో బయలు దేరే ఆర్టీసీ బస్సు డైరీఫామ్, ఉప్పరపల్లి, హైదర్‌రీడ, అత్తాపూర్, లంగర్ హౌజ్, రింగ్ రోడ్డు, బాపూనగర్, సన్ సిటీ, ఖాళీ మందిర్, అప్పా జంక్షన్, నార్సింగ్ మార్గంగా ఔటర్ రింగురోడ్డు సర్వీసు రోడ్డు మీదుగా గచ్చిబౌళి చౌరస్తా కు చేరుకుంటుందన్నారు. సాఫ్ట్వేర్ ఉద్యోగులు సహ అన్ని వర్గాల ప్రయాణికులకు ఈ బస్సు సౌకర్యం ఉపయోగంగా ఉంటుందని అర్టీసీ అధికారులు తెలిపారు. ఆరాంఘర్ నుంచి ఉదయం 6:45 నిమిషాలకు బస్సు సర్వీసు ఉంటుందని, ప్రతి గం టలకు ఒక బస్సు ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 73828188603, 9959225137, 9959226135 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.



డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి కి వినతి పత్రం అందచేస్తున్న సీ ఐ టీ యు నాయకులు

## మెయిన్ రోడ్లపై యంత్రాలతో శుభ్రం చేయించాలి

బుద్వేల్, నవంబరు 20 (నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ లోని మెయిన్ రోడ్డు డివైడర్ల పక్కన యంత్రాలతో ఊడిపించాలని సీఐటీయు రంగారెడ్డి జిల్లా ఆధ్యక్షుడు జె రుద్ర కుమార్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయు నాయకులు సుక్క మోహన్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.సురేందర్రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సం దర్భంగా జె రుద్ర కుమార్ మాట్లాడుతూ, గత కొంతకాలంగా పారిశుద్య కార్మికులు మెయిన్ రోడ్లు ఊడుస్తు. ఇసుక, మట్టి ఎత్తివేస్తున్న సమయంలో కాంతమ్మ, భీమమ్మ మరణించారన్నారు. కొంతమంది కార్మికుల కాళ్లు చేతులు విరిగి నేటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు క్లీనింగ్ చేసే యంత్రాలను పెట్టకుండ కార్మికుల చేత పనులు చేయిస్తున్నారన్నారు. కార్మికులకు కనీస సౌకర్యాలను కల్పించాలన్నారు. ప్రతి కార్మికునికి నెలకు రూ. 26వేలు వేతనంగా చెల్లిం చాలన్నారు. రిటర్మెంట్ బెనిఫిట్ గా రూ. 5లక్షలు చెల్లించాలన్నారు. కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు సి. శ్రీకాంత్, కాలే రాజు. తదితరులు పాల్గొన్నారు.



## అడిషినల్ జడ్జీకి సన్మానం

మహబూబ్ నగర్, నవంబర్ 20(నమస్తే ఉదయం) మహబూబ్ నగర్ జిల్లా కోర్టు ఫస్ట్ అడిషనల్ జడ్జి కళ్యాణ్ చక్రవర్తి ని కేటిదొడ్డి మండల యువకుడు అశోక్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు

## ఆశా కార్యకర్తలకు యూనిఫామ్‌లు పంపిణీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారి డాక్టర్ జె సంధ్య కిరణ్మయి

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 20(నమస్తే ఉదయం)జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇన్చార్జ్ డిపిహెచ్ఎన్ఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కిరణ్మయి చేతుల మీదుగా గురువారం ఆశా కార్యకర్తలకు యూనిఫామ్ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిపిహెచ్ఎన్ఓ వరలక్ష్మి మాట్లాడుతూ... జిల్లా లో మొత్తం 604 మంది ఆశా కార్యకర్తలకు 1212 చీరలు, ఒక్కొక్కరికి రెండు చీరలు చొప్పున పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ ద్వారా, వారి వారి పీహెచ్సీల యందు త్వరలో ఆశల అందరికీ యూనిఫామ్ అందజేస్తారన్నారు. ఆశా కార్యకర్తలు వారి డ్యూటీ నందు యూనిఫామ్ ధరించి అన్ని ఆరోగ్య



కార్యక్రమాలలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసూనారాణి, డిప్యూటీ డెమో మధుసూదన్ రెడ్డి, జిల్లా ఎన్సిడి కోఆర్డినేటర్ శ్యాంసుందర్, రామాంజనేయులు ,గద్వాల అర్బన్ హెల్త్ సెంటర్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## కూచుకుళ్ళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్రీన్ బోర్డులు నోట్ పుస్తకాలు పంపిణీ

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (బిజినేపల్లి) నవంబర్ 20 (నమస్తే ఉదయం) బిజినపల్లి మండల పరిధిలో కారు కొండ గ్రామంలో కూచుకుళ్ళ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ సరిత గురువారం పాఠశాలకు గ్రీన్ బోర్డులు , విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సెల్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు. కూచుకుళ్ళ ఫౌండేషన్ వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ , ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, ఇంద్రాణి, లావణ్య, చిన్నమ్మ విద్యార్థిని విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్

# కార్మికులందరిని పర్మినెంట్ చేయాలి: వి.జైపాల్ రెడ్డి

బుద్వేల్, నవంబరు 20 (నమస్తే ఉదయం) జీహెచ్ఎంసీ పరిధిలో అన్ని విభాగాలలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వనం పల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఏఐటీయుసీ అనుబంధసంఘమైన తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి టి ఆనంద్ ఆధ్వర్యంలో గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ముందు పారిశుధ్య కార్మికులతో పాటు వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసే వరకు కనీస వేతనంగా నెలకు రూ.26 వేలు చెల్లించాలన్నారు. శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ లకు కనీస వేతనంగా నెలకు రూ.35వేలు, పెట్రోల్ అలవెన్స్, హాజరు తీసుకోవడానికి ట్యాబ్ లు ఉచితంగా ఇవ్వాలన్నారు. కార్మికులకు భద్రత కల్పించాలన్నారు. కార్మికులకు క్యాజువల్ లీవులు సంవత్సరానికి 15 ఇవ్వాల్సి ఉండగా నేటికి వాటిని అమలు చేయడం లేదన్నారు. కార్మికులు ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలకు రూ.30 వేలు చెల్లించాలన్నారు. పనిచేస్తు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి జీవిత భీమా కాకుండ జీహెచ్ఎంసీ నుంచి రూ. 25 లక్షలు చెల్లించాలన్నారు. 60సంవత్సరాలు నిండి పదవీ విరమణ పొందిన కార్మికులకు ఎక్స్రేసియా గా రూ. 10 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థం కావడం లేదన్నారు. కార్మికులందరికి ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ బి సురేందర్రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ 0 రాజేంద్రనగర్ మండల మున్సిపల్ సంఘం అధ్యక్షుడు ఎ రాజు. ఈ సాయిలు. అర్ నర్సిం హ్మ, జి.రమేశ్, డి.పెంటయ్య, అండాలు, లక్ష్మి, అండాలు, కమలమ్మ, మంగమ్మ, తో పాటు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు



## మలిదశ తెలంగాణ ఉద్యమ కారుడు

## వినాయక ప్రీతమ్ రాజు గుండెపోటుతో మృతి

బుద్వేల్, నవంబరు 20 (నమస్తే ఉదయం) : మలి దశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న రాజేంద్రనగర్ కు చెందిన వినాయక ప్రీతమ్ రాజు (57) గురువారం గుండె పోటుతో మరణించారు. ఆయనకు భార్య హంసవేణి, ఇద్దరు కుమారులు వినాయక జీవన్, వినాయక సన్నీలు ఉన్నారు. వినాయక ప్రీతమ్ రాజు టీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా ఉద్యమ నాయకునిగా, రాజేంద్రనగర్ ఏరియా కమిటీ కన్వీనర్ గా పనిచేశారు. తుది శ్వాస విడిచే వరకు ఆయన బీఆర్ఎస్ లోనే కొనసాగారు. వినాయక ప్రీతమ్ రాజు మరణవార్త గురించి తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు అన్నపురెడ్డి భీమార్జున్ రెడ్డి, పోరెడ్డి ధర్మారెడ్డి, డాక్టర్ వి శ్రీరాములు, క్యాసారం శంకర్ రావు, అక్కిరాజు సుబ్బారావు, వీర్లపల్లి నవీన్ కుమార్ తో పాటు రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంగలారం శ్రీనివాస్, శ్యామల గంగాధర్ లు, నవజ్యోతి యూత్ క్లబ్ పాలకవర్గ సభ్యులు, సీనియర్ సభ్యులు సంతావం ప్రకటించారు. శుక్రవారం రాజేంద్రనగర్ శ్మశానవాటిక లో అంత్యక్రియలు జరుగుతాయని కుటుం బ సభ్యులు తెలిపారు.

## తెలంగాణలో ప్రతిపక్షం నిద్రపోతుంది..

# పాలకపక్షం కనిపించడం లేదు

### కల్వకుంట్ల కవిత ఆరోపణ

బుద్వేల్, నవంబరు 20 (నమస్తే ఉ దయం) : తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పక్షం నిద్రపోతుందని, పాలకపకం కనిపించడం లేదని, సామాజిక బాధ్యతగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జాగృతి జనం బాట కార్యక్రమాన్ని రాష్ట్రంలోని 33 జిల్లాలలో చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకుం టున్నామని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి జనం భాట కార్యక్రమంలో బాగంగా గురువారం ఉదయం రాజేంద్రనగర్ నియోజకవర్గం పీడీపీ చౌరస్తా కు వచ్చిన కల్వకుంట్ల కవిత సమకంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చలసాని విష్ణుమూర్తి తన అనుచరులతో కలసి జాగృతి లో చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత వారికి జాగృతి కం డువా కప్పి అహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. గురు, శుక్రవారాలలో రంగారెడ్డి జిల్లాలో జాగృతి జనం బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఇది పదో జిలా అన్నారు. సామాజిక తెలంగాణ సాదించడానికి జాగృతి పనిచేస్తుందన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పేదవారికి మేలు చేసే విధంగా జాగృతి కార్యకర్తలు, నాయకులు పనిచేయాలన్నారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, కేసీఆర్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. ఫెన్షన్ లు పెంచుతామని వాటిని పెంచలేదన్నారు. హైదరాబాద్ ప్రపం చ స్థాయిలో పేరు తెచ్చుకున్నప్పటికీ రాజేంద్రనగర్ లో పేదలు నివసించే ప్రాంతాలలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చారని అరోపిం చారు. తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసే విదంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర పరువును తీసే విదంగా ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి అప్పుల కోసం వెళితే చెప్పుల దొంగ వచ్చి నట్లు చూస్తున్నారని అనడు తెలంగాణ ప్రతిష్టను దిగజార్చేవిదంగా ఉం చన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి, అనంతుల శ్రీనివాస్, శివారెడ్డి, సందీప్, అర్చన సేనాపతి, అల్వాల సురేందర్, నరేశ్. లావణ్య గౌడ్, సునీత కులకర్ణి లు పాల్గొన్నారు



జాగృతి లో చేరిన చలసాని విష్ణు మూర్తి కి కండువా కప్పి ఆహ్వానిస్తున్న కల్వకుంట్ల కవిత

# స్మశాన వాటిక అభివృద్ధికి సహకారం అందిస్తా

### మైనంపల్లి హనుమంతరావు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఆల్వాల్ సర్కిల్ ) నవంబర్ 20 ( నమస్తే ఉదయం ) మచ్చ బొల్లారం డివిజన్లోని స్మశాన వాటిక అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. గురువారం మచ్చ బొల్లారం లోని ముక్తి ధాం హిందూ శ్మశాన వాటిక కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కు స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్ లకు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మచ్చ బొల్లారం డివిజన్ బర్టన్గూడ లోని హిందూ స్మశానవాటిక అభివృద్ధికి రూ.1 కోటి 90 లక్షలు మంజూరు చేయించడంలో కీలకపాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ లను హిందూ స్మశాన వాటిక కమిటీ వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు. స్మశానవాటిక అభివృద్ధికి కావాల్సిన నిధులు పొందేందుకు పైస్థాయి అధికారులతో నిరంతరం అనుసంధానం చేస్తూ అనుమతులు పొందగలిగామని వారు చెప్పారు. స్మశాన వాటికను మోడల్ గ్రేవియర్డ్గా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని వారు వెల్లడించారు. ప్రజల సమస్యలను మాటల్లో కాదౌ చేతల్లో చూపడమే తమ పని తీరు అని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తూ ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ స్మశానవాటిక కమిటీ సభ్యులు గుమ్మడి ఆనంద్ రెడ్డి, ఆకుల నర్సింగ్ రావు, పీడి. అశోక్ కుమార్, పుట్నాల కృష్ణ, రామచందర్ రెడ్డి, లడ్డు, భరత్ కుమార్ జైన్, శంకర్ యాదవ్, హరిబాబులతో పాటు స్థానిక నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, తోట లక్ష్మీకాంత్ రెడ్డి, సర్వేష్ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, కృష్ణా గౌడ్, సూర్య కిరణ్, శేఖర్, విఘ్నేశ్వర రెడ్డి, సంపత్ యాదవ్, పద్మ, నిర్మల, సుకన్య, విమల తదితరులు పాల్గొన్నారు.


మచ్చబొల్లారం ముక్తి ధామ్ హిందూ స్మశాన వాటికలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును సన్మానిస్తున్న స్థానికులు



## ఏఐసీసీ కార్యదర్శి జెట్టి కుసుమ్ కుమార్‌కు ఘన సత్కారం

### శుభాకాంక్షలు తెలిపిన కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి

కూకట్‌పల్లి, నవంబర్ 20 (నమస్తే ఉదయం) అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యదర్శిగా ఒడిశా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమితులైన సీనియర్ నాయకుడు జెట్టి కుసుమ్ కుమార్‌ను కూకట్ పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల జశ్వంత్ రావు (జీజేఆర్) ఆధ్వర్యంలో నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన స్వగృహానికి వెళ్లి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పటిష్టత కోసం నిరంతరం కృషి చేస్తున్న జెట్టి కుసుమ్ కుమార్‌కు జాతీయ స్థాయి బాధ్యతలు దక్కడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఒడిశా రాష్ట్ర ఇన్‌చార్జిగా ఆయన తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థి సంజీవరావు, మాజీ ఉపాధ్యక్షురాలు రేష్మ, నాయకులు రాజేష్ గౌడ్, మాకదూమ్, రామారావు, జాన్, బాబురావు, శ్రీధర్ చారి, గిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

### తాసిల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్

కూకట్ పల్లి, నవంబర్ 20 (నమస్తే ఉదయం) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజలలోకి తీసుకెళ్లాలని టిపిసిసి ఉ పాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ అన్నారు. గురువారం కూకట్ పల్లి తహసిల్దార్ కార్యాలయం లో నియోజకవర్గంలో ని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ నేరుగా చెక్కులు అందజేసి, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వ కార్యాలయాల్లో ఏదైనా జరిగితే అక్కడ ప్రోటోకాల్ ప్రకారం ఉన్న ముఖ్య అధికారి ప్రభుత్వం, ఆ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ప్రతినిధిలు, తదితర శాఖల మంత్రుల ఫొటోలు, అలాగే ఆ కార్యక్రమానికి సంబంధించిన వివరాలు తెలియజేస్తూ ఒక బ్యానర్ రూపం ప్రదర్శిస్తూ సదరు కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యత అధికారుల పైన ఉందని, అది రాజ్యాంగ పరమైన సూచిక అని అన్నారు. ఈ కార్యక్రమం లో నాగిరెడ్డి, పుష్ప రెడ్డి, ప్రవీణ్, కృష్ణ రాజ్పుత్, అరవింద్ రెడ్డి, అప్పారావు, రంగస్వామి, జమీర్, రాజు, శివ చౌదరి, సంధ్య రజిత తదితరులు పాల్గొన్నారు.


భూపాల్ నగర్ పేదలతో మాట్లాడుతున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

## భూపాల్ నగర్ పేదలకు వారున్న చోటనే ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

### జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

బుద్వేల్, నవంబరు 20 (నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ డివిజన్ భూపాల్ నగర్ లో 45 సంవత్సరాలుగా అటవీశాఖ భూముల్లో ఇండ్లు నిర్మించుకుని జీవిస్తున్న పేద ప్రజలకు వారు ఉన్న చోట నే ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చి మౌలిక సదు పాయాలను కల్పించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూపాల్నగర్ లో అటవీశాఖ కు ఉన్న భూమికి రెండింతలు ఇతర చోట వారికిచ్చేలా ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. తెలంగాణ జాగృతి జనం బాట కార్యక్రమంలో బాగంగా గురువారం కల్వకుంట్ల కవిత భూపాల్నగర్ కు చేరుకుంది. భూపాల్నగర్ కొండలపై పేదలు నిర్మించుకున్న ఇండ్లలోకి వెళ్లి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా వివాహం జరిగిన ఓ జంటను ఆశీర్వదించి పండ్లు అందజేశారు. అనౌ

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733